సాక్షి
సూర్యాపేట
ఆదివారం । 5 । మార్చి । 2023



లిఫ్ట్ పనులు నిలిపివేయాలి
నూతనంగా చేపట్టిన లిఫ్టు నిర్మాణ పనులు నిలిపివేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. - 8లో



మట్టపల్లిలో నిత్య పూజలు
మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం నిత్యపూజలు కొనసాగాయి. - 8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 37°/19°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నీటి వృథాను నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్

చివ్వెంల(సూర్యాపేట) : వాన నీటిని ఒడిసి పట్టి, నీటి వృథాను నివారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని జి.తిర్మలగిరి లో వాటర్ అండ్ ల్యాండ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (డబ్ల్యూఏఎల్ఏఎంటీఏఆర్ఐ) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏఈఓలకు వాన నీటిని ఒడిసి పట్టడం అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేల, నీటి సంరక్షణ చాలా ముఖ్యమని, నీటి కుంటలు ఏర్పాటు చేయడం, మల్చింగ్‌తో నేలను కప్పి వేయడం ద్వారా సేద్యానికి ఉపయోగపడుతాయన్నారు. రైతులు వరి పంటకే పరిమితం కాకుండా, చిరు ధాన్యాలు, కూరగాయలు, ఉద్యానవన పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. సాగునీటి సౌకర్యం లేని సమయంలో సూర్యాపేట జిల్లా తీవ్ర నీటి కొరతను ఎదుర్కొందన్నారు. ఎస్సారెస్పీ వచ్చాక నీరు సమృద్ధిగా పెరిగిందన్నారు. నీటిని సక్రమంగా వినియోగించుకుని వాణిజ్య పంటలు పండించి మంచి లాభాలు పొందాలన్నారు. అదే విధంగా ఆయిల్‌పామ్‌సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ బి.క్రిష్టారావు, ఏడీ అన్నపూర్ణ, ఏఓ సామ్రాట్, చివ్వెంల ఏఓ ఆశా కుమారి, సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, 70 మంది ఏఈఓలు పాల్గొన్నారు.

10న డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో రెండు పీడియాట్రీషియన్ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈనెల 10వ తేదీన డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూ లు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటా చలం తెలిపారు. ఈమేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా ఈ భర్తీ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

సూర్యాపేట రూరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకొని ఆ దిశగా ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సూచించారు. శనివారం సూర్యాపేట మండల పరిధిలోని ఇమాంపేట ఆదర్శ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటర్, టెన్త్ వార్షిక పరీక్షల ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు.100శాతం ఉత్తీర్ణత పై పలు సూచనలు చేశారు. అనంతరం ప్రతి తరగతి గదికి వెళ్లి పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు చెప్పిన సమాధానాలకు డీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పదో తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఆయన కోరారు. ఆయన వెంట విద్యాశాఖ అధికారి శ్రావణ్, ప్రిన్సిపాల్ బి. శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

గున్నం నాగిరెడ్డి విగ్రహావిష్కరణ రేపు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడుకు చెందిన రిటైర్డ్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏపీ బ్రూవరేజెస్ కార్పొరేషన్ మాజీ సలహాదారు దివంగత గున్నం నాగిరెడ్డి విగ్రహ ఆవిష్కరణ సోమవారం ఉన్నట్లు శ్రీ తిరుపతమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గున్నం రమాదేవి, ధర్మకర్త గున్నం రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు. ఈ విషయాన్ని శనివారం విలేకరులకు తెలిపారు. నాగిరెడ్డి విగ్రహాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

కస్తూర్బాలో ఇష్టారాజ్యం

స్థానికంగా ఉండని ఉద్యోగులు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- అమలు కాని మెనూ
- విద్యార్థినులకు ఇబ్బందులు వచ్చినా పట్టించుకునేవారే కరువు

- సూర్యాపేట మండలం ఇమాంపేట కేజీబీవీకి ఇటీవల ఉదయం ప్రార్థన సమయానికి సెక్టోరియల్ అధికారి తనిఖీకి వెళ్లగా అక్కడ ఎస్ఓ, ఉపాధ్యాయులు లేరు. విధానం మార్చుకోవాలని ఆదేశించారు. మరో వారం తరువాత అదే స్కూల్‌కు వెళ్లగా పరిస్థితి పునరావృతమైంది.
- జాజిరెడ్డిగూడెం మండలానికి చెందిన కేజీ బీవీని అర్వపల్లిలో నిర్వహిస్తుండగా ఆ విద్యాలయంలోని స్క్రాప్‌ను అనుమతిలేకుండా విక్రయించినట్లు ఐదు నెలల క్రితం జరిగిన జెడ్పీ సమావేశంలోనే సభ్యులు ఆరోపించారు. సంబంధిత ఎస్ఓపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉండగా బదిలీ పేరుతో అధికారులు చేతులు దులుపుకున్నారు.

ఇవీ జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయల్లో సిబ్బంది తీరుకు అద్దంపడుతున్నాయి.



ఇమాంపేట కస్తూర్బా పాఠశాల ప్రార్థన సమయానికి ఉద్యోగులంతా హాజరుకాని దృశ్యం (ఫైల్)

సూర్యాపేట : జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణలేక సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విద్యాలయంలో ఉండకుండా రోజూ రాకపోకలు సాగించడం.. సమయ పాలన పాటించకపోడంతో అనుకోని సంఘటనలు సైతం చోటుచేసుకుంటున్నాయి. బడికి దూరంగా ఉన్న ఆడ పిల్లలకు వసతి ఏర్పాటు చేసి విద్యనందించే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి కేజీబీవీలను నెలకొల్పింది. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు, వివక్షకు గురైన పిల్ల లు ఇక్కడ చదువుకుంటున్నారు. జిల్లాలో 18 కస్తూ ర్బా, 1 అర్బన్ రెసిడెన్షియల్ విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో గరిడేపల్లి, ఆత్మకూర్(ఎస్), మద్దిరాల, చివ్వెంలలో ఇంటర్మీడియట్ విద్యనందిస్తున్నారు. వీటన్నింటిలో మొత్తం సుమారు 3,700 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఒక్కో విద్యాలయంలో ఒక ప్రత్యేక అధికారి, ఏడుగురు అధ్యాపకులు, పీఈటీ, ఏఎన్ఎంతో పాటు నలుగురు సిబ్బంది ఉంటారు. నిబంధనల ప్రకారం ప్రత్యేక అధికారి, అధ్యాపకులు, పీఈటీ, ఏఎన్ఎం విద్యాలయంలోనే ఉంటూ సేవలందించాలి. ఉద్యోగ నియామకం సమయంలోనే అధికారులు వీరికి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అయితే ఆ తర్వాత ఉద్యోగులు ఏవో కారణాలు చెబుతూ విద్యాలయాల్లో ఉండకుండా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో సరైన పర్యవేక్షణ లేక విద్యాలయాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

డ్యూటీకి హాజరుకాకున్నా..

సూర్యాపేట మండల పరిధిలోని ఇమాంపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టి అమ్ముకున్నట్లు ఆరోపణలు ఉండడంతో సంబంధిత ఎస్ఓను సస్పెండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఈ తవ్వకాలు జరిగినట్లు తెలుస్తోంది. ఇదే పాఠశాలలో కొన్ని సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఓ సిబ్బంది డ్యూటీకి హాజరుకాకున్నా వేతనాలు చెల్లిస్తున్నట్లు సమాచారం.

ఆ ఎస్ఓపై చర్యలు కరువు

జిల్లాలోని ఓ కస్తూరిబా విద్యాలయంలో విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్న ఆరోపణలతో అధికారులు ఆ స్కూల్‌కు తనిఖీకి వెళ్లారు. అక్కడ మూడు సంవత్సరాలుగా తమకు మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని విద్యార్థినులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కానీ ఆ ఎస్ఓపై నేటికీ చర్యలు తీసుకోలేదు. జిల్లా విద్యాశాఖ అధికారి ముడుపులు తీసుకొని చర్యలకు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది.

ఫుడ్ ఫాయిజన్ అయినా బయటికి పొక్కకుండా..

నెల రోజుల క్రితం తుంగతుర్తి కేజీబీవీలో సుమారు 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. విషయం బయటికి పొక్కకుండా రహస్యంగా వారికి చికిత్స చేయించారు. కలుషిత ఆహారం, పారిశుద్ధ్య లోపంతోనే వాంతులు, విరేచనాలు కాగా.. పాఠశాల ఊరికి దూరంగా ఉండటంతో గాలో.. ధూళో తాకింది అందుకే విద్యార్థినులకు వాంతులు అయినట్లు ప్రచారం చేసినట్లు తెలుస్తోంది. మూఢనమ్మకాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాల్సిన అధికారులే వాటిని ప్రచారం చేసిన పరిస్థితి వారి పనితీరుకు అద్దం పడుతోంది.

నేడు హుజూర్‌నగర్ మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్‌ఇన్'

ఉదయం 10 : 30 గంటల నుంచి 11 : 30 గంటల వరకు

హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్య ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యనే నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మున్సిపల్ కమిషనర్‌తో ఆదివారం 'సాక్షి' ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్



యాకుబ్ పాషా, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 94408 17222

చైతన్యరెడ్డి తెలంగాణకు, సాయిప్రకాశ్ పంజాబ్‌కు

- సూర్యాపేట జిల్లాకు చెందిన ఇద్దరు ఐపీఎస్‌లకు క్యాడర్ కేటాయింపు



చైతన్యరెడ్డి



సాయిప్రకాశ్

తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లా నుంచి సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన ఇద్దరిలో ఒకరిని తెలంగాణకు, మరొకరిని పంజాబ్ క్యాడర్‌కు కేటాయింపబడ్డారు. 2021 సివిల్ సర్వీస్ పరీక్షల్లో నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బొక్క చైతన్యరెడ్డి 161 ర్యాంకు, తిరుమలగిరి మండలం సిద్ధిసముద్రం గ్రామానికి చెందిన ధరావత్ సాయిప్రకాశ్ 650 ర్యాంకు సాధించారు. చైతన్యరెడ్డి నీటిపారుదల శాఖలో ఏఈగా ఉద్యోగం చేస్తూనే ఆరో ప్రయత్నంలో సివిల్స్‌లో నెగ్గారు. సాయిప్రకాశ్ మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ ర్యాంకు సాధించారు. ఐపీఎస్‌కు ఎంపికైన వీరు ఇటీవల హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిని శుక్రవారం ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు కేటాయించింది. చైతన్యరెడ్డిని తెలంగాణ క్యాడర్‌కు, సాయిప్రకాశ్‌ను పంజాబ్ క్యాడర్‌కు కేటాయించారు. తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ఐపీఎస్‌కు ఎంపిక కావడం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన

భానుపురి (సూర్యాపేట) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం సూర్యాపేట జిల్లా జేఏసీ అధ్యక్షుడు నేతకాని వెంకన్న మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ కన్వీనర్ సురేష్, ఎస్ఈ పాల్ రాజ్, డీఈఈలు రాజశేఖర్, దాలి నాయుడు, కోకన్వీనర్ దశరథ రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, అబ్దుల్ రషీద్, యాదగిరి నాయుడు, దయాకర్ రెడ్డి, వెంకన్న, వెంకటనారాయణ, శ్రీనివాస్, రమేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్లస్టర్లు పెంపు!

- అదనంగా 125 క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- పెరిగిన సాగు విస్తీర్ణంతో ఏఈఓలపై పనిభారం
- కష్టాలకు చెక్ పెట్టడానికే నిర్ణయం



కొత్తగూడెంలోని రైతువేదిక

నాగారం : రైతులకు వ్యవసాయ సూచనలు, సలహాలు అందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సాగు విస్తీర్ణం మేరకు క్లస్టర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. గతంలో ఉన్న సాగు భూమి లెక్కల ఆధారంగా ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించింది. ప్రభుత్వం సాగు నీటి వసతి కల్పించడం, పెట్టుబడి సాయం అందించడంతో గతంతో పోలిస్తే విస్తీర్ణం భారీగా పెరిగింది. కానీ క్లస్టర్లను పెంచకపోవడం, సిబ్బందిని నియమించకపోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులపై పని భారం పెరిగింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అదనంగా వ్యవసాయ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం సాగయ్యే విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలో అదనంగా మరో 125 క్లస్టర్లు అవసరం ఉంటుందని అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. జిల్లాలో 6.20లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. రైతులకు సంక్షేమ పథకాలు చేరడానికి ప్రభుత్వం క్లస్టర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. సిబ్బందిని నియమించి, రైతు వేదికలను నిర్మించింది. రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలు, పంటల సమగ్ర సర్వే, ఇతర పనులు క్లస్టర్ల పరిధిలో ఉండే వ్యవసాయ విస్తరణ అధికారులే చేయాల్సి ఉంది. రోజూ క్లస్టర్ పరిధిలో ఉండే గ్రామాన్ని సందర్శించి, అవగాహన కార్యక్రమాలు, సాగు సలహాలు, సూచనలు చేయాల్సి ఉంటుంది. ప్రారంభంలో రెవెన్యూ లెక్కల ఆధారంగా క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రైతు వారీగా ఏయే పంటలు, ఎంత విస్తీర్ణం సాగు చేస్తున్నారనే సమాచారం సేకరించడంతో సాగు లెక్కలు పక్కాగా తేలాయి. ఈ లెక్కన అదనంగా క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సాగు విస్తీర్ణం	ప్రస్తుతం ఉన్న క్లస్టర్లు
6.20 లక్షల ఎకరాలు	82
ఏఈఓలు	**కొత్తగా ప్రతిపాదన**
82	125

ప్రతిపాదనలు పంపించాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు అదనపు క్లస్టర్ల కోసం ప్రతిపాదనలు పంపించాం. నీటి వసతి ఉండటంతో జిల్లాలో గతంలో పోల్చితే సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం సాగయ్యే పంటల విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో మరికొన్ని క్లస్టర్లు ఏర్పాటు చేయడం అవసరమని గుర్తించాం. – రామారావు నాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

కొందరికి పదివేల ఎకరాలకు పైనే..

పట్టా, పోడు, ఇతర భూములను కూడా పరిగణనలోకి తీసుకుంటే కొంత మంది వ్యవసాయ విస్తరణ అధికారుల పరిధి పదివేల ఎకరాలు దాటుతోంది. రైతుల వారీగా సమగ్ర సర్వే వానాకాలం, యాసంగి సీజన్ల వారీగా చేయాల్సి ఉంది. కొంత మందికి వేల ఎకరాలు ఉండటంతో పనిభారం ఎక్కువ అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు నాగారం మండలంలోని నాగారం, వర్ధమానుకోట, ఫణిగిరి క్లస్టర్ల పరిధిలో సుమారు 23వేల ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం ఉంది. ఇదే పరిస్థితి జిల్లాలోని అనేక క్లస్టర్లలో నెలకొంది. ప్రతి సీజన్‌లో రైతుల వారీగా పంటల వివరాలను పొలం వద్దకు వెళ్లి ట్యాబ్‌లో నమోదు చేయాలి. రైతుబంధు దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. రైతుబీమా పరిహారం అందేలా చూడాలి. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఖాతాలో రైతులకు డబ్బులు జమ కాకపోతే పరిశీలించాలి. పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల్లో రైతులను ధ్రువీకరించాలి. పంట కోత ప్రయోగాలు నిర్వహించి, దిగుబడులను అంచనా వేయాలి.

ప్రణాళికతో పథకాలను అమలు చేస్తున్నాం

- కలెక్టర్ వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత్ కేశవ్, మోహన్‌రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలోని అభివృద్ధి , సంక్షేమ పథకాలను పటిష్టమైన ప్రణాళికతో అమలు చేస్తున్నామని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. జిల్లా అభివృద్ధి, పథకాల అమలు తీరును పరిశీలించేందుకు వచ్చిన యూనియన్ సర్వీస్‌కు చెందిన ఐఎస్ఎస్, ఐఈఎస్ ట్రైనీలకు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతు బంధు, దళిత బంధు , పల్లె ప్రకృతి వనాలు, హరితహారం, కంటి వెలుగు, మన ఊరు– మనబడి కార్యక్రమాలు అమలులో ఉన్నాయన్నారు. పల్లెలు, పట్టణాలకు దీటుగా అభివృద్ధిలో నిలుస్తున్నాయని, మిషన్ భగీరథ ద్వారా అన్ని ఆవాస ప్రాంతాల్లో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందిస్తున్నామన్నారు. జిల్లాలో వరి గణనీయంగా సాగవుతోందని, అలాగే ఆయిల్ పామ్ సాగుకు కూడా అధిక ప్రాధాన్య మిస్తూ పంట సాగు విధానంపై రైతు వేదికల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 10 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం పెట్టుకున్నామని, ఇప్పటికే 1,452 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు అవుతోందని వివరించారు. అన్ని గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో ప్రతి హరిత హారం నిర్వహణలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటుతున్నామని, జిల్లాను పచ్చని తివాచీలా మార్చేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు.అనంతరం సంక్షేమ పథకాల అమలు తీరును వెబెక్స్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, ఎస్. మోహన్‌రావు, జెడ్పీ ఈఈఓ సురేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ నిర్మాణ పనుల పరిశీలన

సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న గదులను చూసి ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం కనిపించేలా వివిధ రకాల పూల మొక్కలను పెంచాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు లిఫ్టులను ఏర్పాటు చేయాలన్నారు. పనులు వేగవంతంగా చేసేలా చర్యలు తీసుకోవాలని, కలెక్టరేట్ పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోడ్ల భవనాల శాఖ డీఈ మహిపాల్ రెడ్డి, యుగేంధర్, కాంట్రాక్టర్, సైట్ ఇంజనీర్ కిషోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏర్పాట్లు చేస్తాం




వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ పథకాల అమలుకు ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిలతో కలిసి మహిళా ఆరోగ్యం , సీపీఆర్ శిక్షణ, కంటి వెలుగు, వడ్డీ లేని రుణాలు, తదితర అంశాలపై కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో ఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జీఓ నంబర్ 59 కు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి ఈ నెల చివరి నాటికి క్రమబద్ధీకరణ పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో రెండు పడక గదుల నిర్మాణం త్వరలో పూర్తి చేసి పంపిణీకి సిద్ధం చేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, ఎస్. మోహన్‌రావు, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, వెంకారెడ్డి, కిషోర్ కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌతం ప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

చివ్వెంల(సూర్యాపేట) : చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతం ప్రసాద్ అన్నారు. మహిళాదినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రోజు రోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. మహిళలను అన్ని వేళల్లో గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలకు పోరాడాలి, కానీ ప్రాణాలు తీసుకోవద్దని కోరారు. గ్రామాల్లో మహిళా సర్పంచ్‌ల భర్తలే పెత్తనం చెలాయిస్తున్నారని, మహిళలకు తగిన గౌరవం ఇచ్చి వారిని పాలన చేసేలా చూడాలన్నారు. మహిళలకు ఇంకా పూర్తిస్థాయిలో స్వాతంత్ర్యం రాలేదన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు న్యాయమూర్తి ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీసపల్లి సోమేశ్వర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న మహిళ మృతి


కమలమ్మ(ఫైల్)

అర్వపల్లి: పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాజిరెడ్డిగూడే నికి చెందిన పెకటోజు కమలమ్మ(45) గతనెల 18న ఇంట్లో పనిచేసుకుంటుండగా పాముకాటుకు గురైంది. వెంటనే ఆమెను సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి తండ్రి భిక్షమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

నేలకొండపల్లి: అనుమతి లేకుండా తరలిస్తున్న పేలుడు పదార్థాలను ఖమ్మం జిల్లా నేలకొండపల్లి పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట నుంచి నేలకొండపల్లికి డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా పేలుడు పదార్థాలు తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రెండు బాక్స్‌ల డిటోనేటర్లు, ఐదు బాక్స్‌ల జిలిటెన్ స్టిక్స్, 64బాక్స్‌ల పవర్ బూస్టర్లను స్వాధీనం చేసుకుని ఆర్.నాగరాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ తనిఖీల్లో కూసుమంచి సీఐ జితేందర్, నేలకొండపల్లి ఎస్సై జి.స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాక్స్ చెల్లించని వాహనాలు సీజ్


సీజ్ చేసిన వాహనాలు

అనంతగిరి: రోడ్డు ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలను మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సునీత శనివారం సీజ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్యాక్స్ కట్టని వాహనాల కోసం నిర్వహిస్తున్న ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మూడు ట్రాక్టర్‌లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వాహనదారులు పెండిగ్ ట్యాక్స్‌లను సొంతగా చెల్లిస్తే యాభైశాతమే జరిమానా పడుతుందని, తనిఖీల్లో పట్టుబడితే రెండు వందల శాతం జరిమానా విధిస్తామని తెలిపారు.

గంజాయి రవాణా గుట్టు రట్టు!

- చౌటుప్పల్‌లో నాలుగు వందల కిలోలు పట్టివేత
- నలుగురు నిందితుల అరెస్ట్.. పరారీలో మరో ముగ్గురు
- డీసీఎం, కారు, 5సెల్‌ఫోన్లు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి


డీసీఎం వాహనం కింది భాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్స్

చౌటుప్పల్ : నిషేధిత గంజాయి రవాణా గుట్టును చౌటుప్పల్ పోలీసులు రట్టు చేశారు. వాహనాల తనిఖీలో డీసీఎంలో తరలిస్తున్న నాలుగు వందల కిలోల గంజాయిని పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా మరో ముగ్గురు పరారయ్యారు. సీఐ ఎరమాద మల్లికార్జున్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నవరం ప్రాంతంలోని కృష్ణదేవిపేట నుంచి ఏడుగురు నిందితులు మహారాష్ట్రకు తరలించే నిమిత్తం గంజాయిని కొనుగోలు చేశారు. దానిని డీసీఎం వాహనంలో వేసుకున్నారు. డీసీఎం వాహనం బాడీ కింది భాగంలో ప్రత్యేకంగా డబ్బాను ఏర్పాటు చేశారు. ఇది వాహనంలో బాడీ నుంచి ఎంత వెతికినా కన్పించని విధంగా ప్రత్యేకంగా రూపొందించారు.

రూటు మార్చి అక్రమ రవాణా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు వెళ్లాలంటే సహజంగా విజయవాడ నుంచి లేదంటే ఖమ్మం నుండి సూర్యాపేట మీదుగా వెళ్తుంటారు. అయితే ఈ మార్గంలో పోలీసులు తనిఖీలు అధికంగా ఉంటాయని భావించిన నిందితులు రూటు మార్చారు. రాజమండ్రి నుంచి ఖమ్మం మీదుగా సూర్యాపేటకు వెళ్లకుండా తొర్రూరు, తిరుమలగిరి, అడ్డగూడూరు, మోత్కూరు, వలిగొండ, చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లేలా ప్లాన్ వేసుకున్నారు. ఈ మార్గంలో అంతగా పోలీసులు తనిఖీలు ఉండవని నిందితులు అనుకున్నట్టుగానే జరిగినప్పటికీ చివరకు చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో చిక్కారు. అయితే గంజాయి రవాణా చేస్తున్న అక్రమార్కులు డీసీఎం వాహనానికి ఇద్దరు నిందితులు ప్రత్యేకంగా ఓ కారును ఏర్పాటు చేసుకొని ముందు ఎస్కార్ట్‌గా వ్యవహరించారు. ఎస్కార్ట్ వాహనం రహదారిపై పోలీసుల తనిఖీల సమాచారాన్ని డీసీఎంలోని వ్యక్తులకు చేరవేస్తూ ఎంతో జాగ్రత్తగా వచ్చినప్పటికీ చివరకు పట్టుబడ్డారు.

ప్రత్యేకంగా బాక్స్ ఏర్పాటు చేసుకుని..

పట్టణ కేంద్రంలోని వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద శనివారం సీఐ మల్లిఖార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేకంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో గంజాయిని తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని గుర్తించారు. దగ్గరకు వెళ్లి పరిశీలిస్తున్న క్రమంలో ముగ్గురు నిందితులు అక్కడి నుంచి తప్పించుకున్నారు. నలుగురు పట్టుబడ్డారు. డీసీఎంకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌లో ప్యాకెట్లుగా చేసిన 4వందల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా డీసీఎం, కారు, 5సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. రాచకొండ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్, అదనపు కమిషనర్ సత్యనారాయణ, భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, చౌటుప్పల్ ఏసీపీ నూకల ఉదయ్‌రెడ్డిలు పోలీసులను అభినందించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


అశోక్‌రెడ్డి (ఫైల్)

హుజూర్‌నగర్‌రూరల్ : పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వేపలసింగారం గ్రామానికి చెందిన బల్సూనూరి వీరారెడ్డి, శంభమ్మ దంపతులకు కుమారుడు, కుతురు ఉన్నారు. కూతురు వివాహం కాగా కుమారుడు అశోక్‌రెడ్డి (21) తండ్రికి వ్యవసాయంలో సహాయం చేస్తూ వరికోత మిషన్(హార్వేస్టర్) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అశోక్‌రెడ్డి శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం తండ్రి పొలానికి పిచికారీ చేసేందుకు ఇంట్లో పెట్టిన పురుగు మందు డబ్బాను తీసుకుని వెళ్లాడు. మేళ్లచెర్వు రోడ్డులో ఉన్న మడేలయ్య దేవాలయం సమీపం నుంచి సోదరి కీర్తిరెడ్డికి వీడియో కాల్ చేసి తాను పురుగుల మందు తాగి చనిపోతున్నట్లు చెప్పాడు. ఈ రోజు 11 గంటలకి నా లాస్ట్ డేట్ అనే స్టేటస్ పెట్టి సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసాడు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహాయంతో అక్కడికి వెళ్లి అశోక్‌రెడ్డిని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరి స్థితి విషమించడంతో సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా గతంలో అశోక్‌రెడ్డి నాలు గు సార్లు ఆత్మహత్యాయత్నం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అశోక్‌రెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ కట్టా వెంకటరెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

చౌటుప్పల్ : ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. మండల పరిధిలోని గుండ్లబావి గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కోదాడకు వెళ్తుంది. ఆ క్రమంలో పంతంగి టోల్‌ప్లాజా దాటిన తర్వాత గుండ్లబావి శివారులో బస్సు ముందు భాగంలోని ఎడమ వైపు టైరు ఒక్కసారిగా పగిలిపోయింది. దీంతో బస్సు అదుపుతప్పుతుండగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వేగాన్ని నియంత్రించాడు. హైవేకు ఎడమ వైపున బస్సు ఆపాడు. ఆ సమయంలో బస్సులో సీట్లకు మించి ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. ఎలాంటి ప్రమాదం జరగకుండా బయటపడడంతో ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు.

నేరాలకు పాల్పడితే శిక్షలు తప్పవు

- సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్


మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేటక్రైం : నేరాలకు పాల్పడితే చట్టపరమైన శిక్షలు తప్పవని సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో కోర్టు విధుల నిర్వహణ, కేసుల్లో నేరస్తులకు శిక్షల అమలు, కోర్టు అధికారులతో సమన్వయం తదితర అంశాలపై డీఎస్పీ, సీఐ, కోర్టు డ్యూటీ పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో కోర్టు డ్యూటీ ఫంక్షనల్ వర్టికల్ పని చేసే భాగాన్ని సమర్థవంతంగా అమలు చేయడంపై డీజీపీ ప్రత్యేక ప్రణాళిక సూచించారన్నారు. కోర్టు డ్యూటీ విధుల నిర్వహణలో సిబ్బంది, సంబంధిత ఫంక్షనల్ వర్టికల్ అధికారి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. కోర్టులో ఉన్న కేసులకు శిక్షలు పడేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. నేరస్తులకు శిక్షణ పెరగాలంటే ప్రతి కేసును లోతైన విచారణ చేయాలని, వేగవంతమైన దర్యాప్తు చేయాలన్నారు. కోర్టు అధికారులతో సమన్వయంగా పని చేయాలని సకాలంలో సాక్షులను, బాధితులను కోర్టులో హాజరు పరచాలని తెలిపారు. హత్య కేసులు, హత్య ప్రయత్నాలు, అత్యాచారం, దాడులు, దొంగతనాలు, పోక్సో కేసులు, చీటింగ్, హింస కేసుల్లో త్వరగా శిక్షలు పడేలా పని చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు నాగభూషణం వెంకటేశ్వర్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, సీఐలు సోమ్ నారాయణ్ సింగ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌లు, సీఐలు ఆంజనేయులు, ప్రసాద్, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

నూతన లిఫ్ట్ పనులు నిలిపివేయాలని రైతుల ధర్నా


చింతలపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): నూతనంగా చేపట్టిన లిఫ్ట్ నిర్మాణ పనులు నిలపుదల చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. పులిచింతల ముంపు గ్రామమైన పాత వెల్లటూరు నుంచి ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ వరకు చేపట్టిన లిఫ్టును పనులు నిలుపుదల చేయాలని కోరుతూ శనివారం చింతలపాలెంలో రైతులు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా స్థానిక రైతు వేదిక నుంచి ర్యాలీ ప్రారంభించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పాత వెల్లటూరు వద్ద ఏర్పాటు చేయబోతున్న లిఫ్ట్‌తో ఎంతో విలువైన తమ భూములు కోల్పోతున్నామని వాపోయారు. తమ పంట పొలాల గుండా పైపులు వేస్తున్నప్పటికీ తమకు సరైన సమాచారం ఇవ్వలేదని వారు తెలిపారు. గతంలో ఉన్న లిఫ్ట్ ద్వారా నీరు అందించకుండా కొత్త లిఫ్ట్ అంటూ రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటే వారు వీధిన పడతారని వారు తెలిపారు. పనులు పకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు తెలిపారు. అనంతరం తహసీల్దార్ వాజిద్‌అలీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చింతలపాలెం, మేళ్లచెరువు, హుజూర్‌నగర్ మండలాలకు చెందిన రైతులు వర్రా వెంకట్‌రెడ్డి, వీరారెడ్డి, సంజీవరెడ్డి, సీతారాములు, వెంకటరెడ్డి, కష్టారెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మారెడ్డి, మౌలాలి, జగన్మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, సీహెచ్ సురేందర్, సీపీఎం నాయకులు వట్టెపు సైదులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడి.. నలుగురి అరెస్ట్


పట్టుబడిన వారితో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

హుజూర్‌నగర్ : సారా స్థావరాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం దాడులు నిర్వహించి నలుగురిని అరెస్ట్ చేశారు. హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నియోజకవర్గంలోని మఠంపల్లి మండలం రఘునాథపాలెం శివారులో సారా తయారీ స్థావరాలపై అధికారులు దాడులు నిర్వహించి 2,400 లీటర్ల బెల్ల పానకం, సారా తమయారీకి ఉపయోగించే డ్రమ్ములు, ఇతర వస్తువులను ధ్వసం చేశారు. కొత్త తండాకు చెందిన భూక్య రవి పారిపోగా బాణోతు సోముడు, విజయ, బాణోతు కోట, జ్యోతిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 45 లీటర్ల సారా, 80 కేజీల పటిక, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ శివకష్ణ, ఆయూబ్, బ్రహ్మం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జూదరుడి అరెస్టు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లు శివారు ఓ తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒకరు పట్టుబడగా 9 మంది పరారైనట్లు తెలిపారు. స్థావరంలో రూ.500 నగదు పట్టుబడినట్లు తెలిపారు.

పరిశ్రమలో చోరీకి పాల్పడిన ముగ్గురిపై కేసు

చిట్యాల: పట్టణ శివారులోని మూతబడిన ఓ పరిశ్రమలో చోరీకి పాల్పడిన ముగ్గురిపై శనివారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ ఎన్.ధర్మా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ శివారులో కిరణ్ గ్లోబల్ కెమ్ లిమిటెడ్ పరిశ్రమను ఇటీవల కొన్ని కారణాల వలన మూసి వేసారు. దీంతో ఆ పరిశ్రమలో గతంలో డ్రైవర్‌లుగా పనిచేసిన ఆవుల సతీష్, జాల సత్యనారాయణ, కంబాలపల్లి శ్రీశైలం కాపాలగా ఉన్న నాగు నర్సింహను గత నెల 15న బెదిరించి మిషనరీని చోరీ చేశారు. పరిశ్రమలోని బాయిలర్, ఆటోక్లేవ్ మోటర్, గేర్ బాక్స్, ట్యాంకర్ వీల్స్, టైర్స్, మోటార్ గేర్ బాక్స్ చోరీకి గురయ్యాయి. దీంతో ఆ పరిశ్రమ తరఫున న్యాయవాది జక్కని శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

మోతె : రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన మండల పరిధిలో మామిళ్లగూడెం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మామిళ్లగూడెం గ్రామానికి చెందిన ఇర్రి రాధ(38) సాయంత్రం ఎస్సీ కాలనీకి వెళ్లి తిరిగి ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో మామిళ్లగూడెం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా నుంచి రోడ్డు దాటుతుండగా సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాధను ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

మిర్యాలగూడలో ఉద్రిక్తత

మిర్యాలగూడ : డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని మిర్యాలగూడలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన జరపలేదని, పారదర్శకంగా సర్వే చేయలేదని, దాని కారణంగా అనర్హులకు జాబితాలో పేర్లు వచ్చాయని ఆరోపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆర్డీఓ కార్యాలయం ఎదుట పేదల ఆందోళనలతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సొంత ఇళ్లు ఉన్నవారికి డ్రాలో పేర్లు వచ్చాయని, 3వ వార్డులో డ్రాలో 19 మంది పేర్లు రాగా అందులో 16మంది అనర్హులే ఉన్నారని పలువురు పేర్కొన్నారు. 14వ వార్డు షాబునగర్, రాంనగర్ ఏరియాలో పాదిల సుబ్బమ్మ, సిద్దాపురం రాధిక, పళ్ల సత్తమ్మ, మహమ్మద్ నసీమా, ఇంజి రమ్య, సబెరకు డ్రాలో పేర్లు వచ్చాయని.. శుక్రవారం రాత్రి ఆర్డీఓ కార్యాలయాలనికి పిలిచి సంతకాలు, ఫొటోలు తీసుకున్నారని తెల్లారేసరికి తమ పేర్లకు బదులుగా మరో పేర్లు చేర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 29వ వార్డు బంగారుగడ్డకు చెందిన భాగ్యలక్ష్మి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో అక్కడే ఉన్న పోలీసులు గమనించి ఆమెను ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి భర్తకు అప్పగించారు. 35వ వార్డులో సర్వే సరిగా జరగలేదని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. సర్వేలో అవకతవకలకు జరిగాయని టీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం ఫిర్యాదు చేశారు. రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆందోళనను తెలుసుకున్న బీజేపీ నాయకులు అక్కడికి చేరుకోని వారికి మద్దతుగా ధర్నా నిర్వహించారు. స్పందించిన ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనిల్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించి సమగ్ర విచారణ జరుపుతానని హామీ ఇచ్చారు.

నకిలీ బంగారం ఇచ్చి టోకరా !


వెలుగుపల్లిలో దుండగులు ఇచ్చిన నకిలీ బంగారం

తుంగతుర్తి: ముగ్గురు వ్యక్తులు నకిలీ బంగారం అంటగట్టి మహిళకు టోకరా ఇచ్చారు. ఈ ఘటన మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన తూము లక్ష్మి కిరాణం షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తుంది. గతనెల మూడవ వారంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళ కలిసి తూము లక్ష్మి ఇంటి పక్కన ఇల్లు అద్దెకు తీసుకొని గ్రామంలో సుతారిపని చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిరోజు తూము లక్ష్మి కిరాణంషాపులో సామగ్రి కొనుగోలు చేస్తూ ఆమెతో పరిచయం పెంచుకున్నారు. వారం రోజుల క్రితం ముగ్గురు వ్యక్తులు లక్ష్మి వద్దకు వచ్చి అక్క కూతురు ఆరోగ్యం బాగాలేదని, తమ దగ్గర ఉన్న బంగారాన్ని కుదవపెట్టుకొని లేదా అమ్మి డబ్బులు ఇవ్వాలని బతిమిలాడారు. దీంతో తూము లక్ష్మి వారి మాటలకు సరే అనడంతో ఆ ముగ్గురు వ్యక్తులు మొదటగా వారి దగ్గర ఉన్న చిన్న నిజమైన బంగారపు ముక్కను లక్ష్మికి ఇచ్చారు. లక్ష్మి ఆ బంగారపు ముక్కను తీసుకెళ్లి కొంసాలికి ఇచ్చి నిజమైందా కాదని చూపించింది. ఆ బంగారపు ముక్క నిజమైనదేనని అని కొంసాలి చెప్పాడు. దీంతో లక్ష్మి ఆ ముగ్గురు వ్యక్తుల దగ్గర ఉన్న సుమారు పావు కిలో బరువు ఉన్న నాలుగు బంగారు ముద్దలు తీసుకొని వారికి రూ.1,80,000 నగదు ఇచ్చింది. వారం రోజులైన వారు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి ఆమె దగ్గర ఉన్న నాలుగు బంగారపు ముద్దలను కొంసాలి వద్ద చూపించగా నకిలీదని చెప్పాడు. దీంతో ఆమె మోసపోయానని గ్రహించి శనివారం తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ డానియేల్‌కుమార్ తెలిపారు.

పెద్దగట్టు హుండీ ఆదాయం రూ.3.25లక్షలు

చివ్వెంల(సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జాతర శ్రీ లింగంతుల స్వామి (పెద్ద గట్టు) ఆలయ హుండీని శనివారం అధికారులు లెక్కించారు. ఫిబ్రవరి 9న జాతర ముగిసిన నాటి నుంచి నేటి వరకు రూ.3.25 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ కోడి సైదులు యాదవ్, ఈఓ కుశలయ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


హుండీ లెక్కింపులో పాల్గొన్న అధికారులు

17నుంచి జనచైతన్య యాత్రలు


మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

చౌటుప్పల్ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జనచైతన్య యాత్రలు నిర్వహించనున్నట్లు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు తెలిపారు. చౌటుప్పల్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ఎడాపెడా నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ ప్రజలపై మోయలేని భారం మోపుతుందన్నారు. కేంద్రం తీరుపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు జన చైతన్య యాత్రలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు బట్టుపల్లి అనురాధ, బండారు నర్సింహ, బత్తుల శ్రీశైలం, అవ్వారు రామేశ్వరి, దాసు, స్వామి, శ్రీనివాస్, ప్రభాకర్, ఈదయ్య, రమేష్, దేప రాజు, రాములు, కరుణాకర్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం


ఉద్యోగులతో ఎస్ఈ దేశ్యా

హుజూర్‌నగర్ : విద్యుత్ ఉద్యోగుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని టీఎస్ జెన్‌కో ఎస్ఈ దేశ్యా అన్నారు. పులిచింతల ప్రాజెక్టులోని టీఎస్ జెన్‌కోలో శనివారం జాతీయ భద్రత వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి కూడా భద్రతా నియమాలు పాటించాలన్నారు. ప్రమాద రహితంగా ఈ ఏడాది పూర్తి చేసినందుకు ఉద్యోగులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీఈలు రవి, టీఎస్ఆర్, ఈఈ రత్నం, ఏఓ సునిల్, ఏడీఈలు బెన్హర్, శ్రీనయ్య, వీరబద్రయ్య, పిచ్చిరెడ్డి, గిరి, దుర్గా భవాని, కుసుమ, ఏఈలు పాల్గొన్నారు.

దివ్యాంగులందరికీ బస్సుపాస్‌లు ఇవ్వాలి

గరిడేపల్లి : పర్సంటేజ్‌తో సంబంధం లేకుండా దివ్యాంగులందరికీ బస్సు పాసులు ఇవ్వాలని శనివారం భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆయనకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీ మాదిరిగానే తెలంగాణలో కూడా దివ్యాంగుల బస్‌పాస్ సంవత్సరం నుంచి ఐదేళ్లు పెంచాలని కోరారు. గరుడ, లగ్జరీ బస్సుల్లో కూడా 50 శాతం అనుమతించాలన్నారు. గరిడేపల్లి, నేరేడుచర్ల ఆర్టీసీ బస్టాండ్‌ల్లో మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లూరి ఈదయ్యబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం నగేష్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కుర్ర గోపియాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మున్న మధుయాదవ్, జానీమియా, గురువయ్య తదితరులు ఉన్నారు.

'పది' ఫలితాల్లో యాదాద్రిని అగ్రగామిగా నిలబెట్టాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి : రాబోయే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలబెట్టాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వైఎస్సార్ గార్డెన్‌లో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ టూ స్కోర్ బెటర్ అనే అంశంపై విద్యార్థులకు ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ సీ వీరేందర్ మనో వికాస శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పరీక్షలంటే విద్యార్థులు భయాన్ని వీడాలన్నారు. విద్యార్థులు చదువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మంచి మార్కులు సాధించాలన్నారు. సబ్జెక్టులకు తగిన సమయాన్ని కేటాయించి స్వీయ మూల్యాంకనం చేసుకుని మంచి గ్రేడ్ సాధించాలని చెప్పారు. అనంతరం డీఈఓ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో కార్యాచరణ ప్రణాళికను ఏర్పరచుకుని ప్రత్యేక తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివే విధంగా కార్యాచరణను తయారు చేసినట్లు తెలిపారు. అనంతరం సైకాలజీస్టు వీరేందర్ విద్యార్థులకు మనోవికాసం పై అవగాహన, శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ పాండునాయక్, ఏసీజీఈ కృష్ణారెడ్డి, ఎంఈవో నాగవర్ధన్‌రెడ్డి, డీసీఈబీ సహాయ కార్యదర్శి బుస్సా రమేష్, ప్రధానోపాధ్యాయులు రంగరాజన్, పోరెడ్డి రంగయ్య, రఘువెంకట్ సురేష్ కుమార్, జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్య పూజలు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయములో శనివారం నిత్యపూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా స్వామివారికి లక్ష తులసిపూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీవెంకటరావుప్రసాద్, శోభారాణి, దేవాలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, కార్య నిర్వహణాదికారి సిరికొండ నవీన్, భక్తులు, పాల్గొన్నారు.